సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



క్రేజీ కేక్స్

ఒకప్పుడు న్యూఇయర్ అంటే కొత్త దుస్తులు, గ్రీటింగ్ కార్డుల కొనుగోలుకు ప్రజలు ప్రాధాన్యత ఇచ్చే వారు. ఇప్పుడు న్యూఇయర్‌లో కేక్ ఒక భాగమైపోయింది. -8లో



మూగ జీవాలకు వింత వ్యాధి

రామాపురం మండలంలోని కొత్తరోడ్డు నారాయణపురంలో మేకలు, గొర్రెలకు వింత వ్యాధి సోకి జీవాలు మృతి చెందుతున్నట్లు యజమానులు వాపోతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.980	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 162 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	520	555
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 342.040 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ఉద్యోగమేళా

రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్‌ఎస్‌డీసీ), సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన రాజంపేటలోని వెలుగు కార్యాలయంలో జరిగే ఉద్యోగమేళాలో ముత్తూట్ ఫైనాన్స్, క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user&registration లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

న్యాయవాదుల సామూహిక సెలవులు

రాజంపేట: రాజంపేటలో సోమవారం న్యాయవాదులు మూకుమ్మడిగా సెలవులు ప్రకటించామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాది సుదర్శన్ రెడ్డిపై పోలీసులు అనుచిత వైఖరికి నిరసనగా సెలవులు కార్యక్రమం చేపట్టామన్నారు. రెండు రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

1న హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక బస్సులు

బి.కొత్తకోట: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం జనవరి ఒకటిన మదనపల్లె-1 ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో చీఫ్ ఇన్స్‌పెక్టర్ రేవతి సోమవారం తెలిపారు. బుధవారం మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్, బి.కొత్తకోట మండలంలోని కాండ్లమడుగు క్రాస్, బి.కొత్తకోట నుంచి వీటిని నడుపుతున్నట్టు తెలిపారు.మదనపల్లె-హార్సిలీహిల్స్ మధ్య 11 బస్సులు తిరుగుతాయన్నారు. కడప, రాయచోటి, సత్యసాయి, అనంతపురం ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల కోసం హార్సిలీహిల్స్ దిగువ కాండ్లమడుగు వద్ద నుంచి కొండపైకి 10 బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. బి.కొత్తకోట నుంచి హార్సిలీహిల్స్‌కు 4 బస్సులు నడుస్తాయని చెప్పారు.

అంగళ్లు సర్పంచ్ విశ్వారెడ్డికి బెయిల్ మంజూరు

కురబలకోట: మండల వైఎస్సార్ సీపీ నాయకులు, అంగళ్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డికి జిల్లా కోర్టు సోమవారం సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది. ఇటీవల ముదివేడు పోలీసులు సర్పంచ్ విశ్వారెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి (డిష్)కుమార్, ముత్ర దామోదర్‌రెడ్డితో పాటు జేసీబీ నిర్వాహకులు, ఆపరేటర్ మొత్తం ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై కోర్టులో వాదనలు విన్న తర్వాత విశ్వారెడ్డికి బెయిల్ మంజూరు చేశారు. మంగళవారం ఉదయం ఆయన విడుదల కానున్నారు.

నేడు రేషన్‌డీలర్ల ఖాళీలకు రాతపరీక్ష

మదనపల్లె: మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో ఖాళీగా ఉన్న రేషన్‌షాపు డీలర్ల నియామకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 119 షాపులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే...13 షాపులకు సంబంధించి కోర్టు కేసుల కారణంగా దరఖాస్తులు స్వీకరించలేదన్నారు. 82 షాపులకు సంబంధించి 347 మంది అభ్యర్థులు అర్హత సాధించడంతో రాతపరీక్షకు హాల్ టికెట్లు మంజూరుచేశామన్నారు. మిగిలిన షాపులకు దరఖాస్తులు రాకపోవడంతో వాటికి మరోసారి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. రాతపరీక్ష 80 మార్కులకు ఉంటుందని, అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు.

సమగ్ర శిక్ష కార్యాలయ ఉద్యోగాలకోసం దరఖాస్తులు

రాయచోటి: జిల్లా ప్రాజెక్టు ఆఫీసు, సమగ్ర శిక్ష, రాయచోటిలోని ఫారిన్ సర్వీస్ నిబంధనలు, షరతులపై పోస్టుల్లో పనిచేయడానికి జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు జిల్లా కలెక్టర్ సోమవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. బాలిక శిశు అభివృద్ధి అధికారి (జీసీడీఓ) ఈ పోస్టుకు మహిళా ఉపాధ్యాయులు మాత్రమే అర్హులన్నారు. సహాయ ప్రత్యామ్నాయ పాఠశాల సమన్వయకర్త, సహాయ బాలిక శిశు అధికారి (మహిళా ఉపాధ్యాయులు మాత్రమే), అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు బయోడేటాతోపాటు డిగ్రీ, బీఈడీ, పీజీ, డిగ్రీ, ఎంఈడీ, ఇతర సర్టిఫికెట్లను జతచేసి 2025 జనవరి 4వ తేదిలోగా సంబంధిత ప్రధానోపాధ్యాయుని ద్వారా జిల్లా ప్రాజెక్టు అధికారి సమగ్ర శిక్ష, రాయచోటి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

కొత్త ఏడాది సరికొత్త మోసాలు

సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతుంటే... మోసగాళ్లు అంతే వేగంగా నయా మోసాలకు దారులు వెతుక్కుంటున్నారు. ప్రతిదీ టెక్నాలజీమయం అయిన ప్రస్తుత కాలంలో నేరగాళ్లు ఆన్‌లైన్‌ను ఆసరాగా చేసుకుని సరికొత్త సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులకు పంపించే శుభాకాంక్షలు, కొత్త ఏడాది సందర్భంగా వివిధ కంపెనీలు ప్రకటించే ఆఫర్లను మోసాలకు మార్గాలుగా ఎంచుకుంటున్నారు. కొన్ని బోగస్ లింక్‌లను, ఏపీకే ఫైల్స్‌లను పంపి ప్రజలకు కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. వీటిపై ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

- శుభాకాంక్షల పేరుతో ఫోన్లకు ఏపీకే ఫైల్స్, లింక్‌లు
- ఒక్క క్లిక్‌తో బ్యాంకు ఖాతాలు ఖాళీ
- అప్రమత్తతతో వ్యవహరించాలంటున్న పోలీసులు



మదనపల్లె: నూతన సంవత్సర వేళ సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు సిద్ధమయ్యారు.సైబర్‌మోసాలకు గురైన బాధితులు తమకు జరిగిన మోసంపై ఫిర్యాదుచేసేందుకు ముందుకు రావడం లేదు. జరుగుతున్న నేరాల్లో అతి తక్కువ శాతం మాత్రమే ముందుకు వచ్చి కేసులు నమోదు చేస్తున్నారు. కొత్త సంవత్సర శుభాకాంక్షల పేరుతో మొబైల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా సందేశాల లింక్‌లు సైబర్ కేటుగాళ్లు పంపిస్తున్నారు. గుర్తు తెలియని నంబర్ల ద్వారా వచ్చే ఈ లింక్‌లను ఏమాత్రం క్లిక్‌చేసినా మీ బ్యాంకు ఖాతాల్లో నగదును క్షణాల్లో సైబర్ నేరగాళ్లు మాయం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఫోన్ల మెసేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

మోసం చేసేది ఇలా.....

ఈ రోజు సాయంత్రం ముగిస్తే చాలు. అర్ధరాత్రికి కొత్త సంవత్సరం 2025లోకి అడుగుపెడుతున్నాం. సాయంత్రం నుంచే నూతన సంవత్సర హంగామా మొదలవుతుంది. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు చెప్పడానికి ప్రతి ఒక్కరూ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు వినూత్నంగా ఆలోచిస్తూ మొబైల్‌లో వచ్చే రకరకాల చిత్రాలు, సందేశాలను తమ పేర్లతో సహా తయారు చేసుకుని పంపుతారు. అయితే ఈ అవకాశాన్ని సైబర్ నేరగాళ్లు వినియోగించుకునే వ్యూహరచన చేశారు. మీకు నచ్చే విధంగా మీ పేరుతో గ్రీటింగ్స్, సందేశాలను పంపుకోవచ్చని, మీరు చేయవలసిందల్లా ఈ కింది లింక్‌పై క్లిక్‌చేసి వివరాలు నమోదు చేస్తే...మిగిలిందంతా తామే చూసుకుంటామని కేటుగాళ్లు మస్కా కొడతారు. మన మొబైల్‌లోని టెలిగ్రామ్, వాట్సాప్‌లకు ఏపీకే(ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైల్స్ రూపంలో మెసేజ్‌లు పంపుతారు. పొరపాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే... అంతే సంగతులు. మన ఫోన్‌లో సమాచారమంతా కేటుగాళ్లకు వెళ్లిపోతుంది. కాంటాక్ట్ నంబర్లు, ఫోటోలు, వీడియోలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలే గాక డాక్యుమెంట్ ఫైళ్లు సైతం ఆ కేటుగాళ్లకు చేరిపోతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- అపరిచితుల వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు.
- ఫోన్‌లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రమ్ అన్‌నోన్ సోర్సెస్ అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. ఇలా చేస్తే మనకు తెలియకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కాకుండా ఉంటాయి.
- మొబైల్ సెట్టింగ్‌లో ఫోన్ నెంబర్లను యాక్సెస్ చేసే అనుమతి ఇవ్వరాదు.
- తెలియని ఏపీకే ఫైల్స్, మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయితే ఫోన్‌లో రీసెట్ ఆప్షన్ కొట్టాలి.
- ఈ-మెయిల్స్, టెక్స్ ఇతర సోషల్‌మీడియా యాప్‌ల ద్వారా నకిలీ లింక్స్‌ను గుర్తించాలి.



వాటిపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయరాదు.


- గివ్‌అవేస్ పోటీల ద్వారా వినియోగదారులను ట్రాప్ చేసి వ్యక్తిగత సమాచారాన్ని దోచేస్తారు. మన వివరాలను సేకరించి డార్క్‌వెబ్‌కు అమ్మేస్తారు.
- మన మొబైల్ లేక ల్యాప్‌టాప్, కంప్యూటర్‌లలో ఉండే ఆపరేటింగ్ సిస్టమ్, యాంటీ వైరస్ ప్రోగ్రామ్, అధికారిక యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. ఎందుకంటే సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా సంబంధిత సంస్థలు ఎప్పటికప్పుడు తమ వ్యవస్థల్లో మార్పులు చేస్తుంటాయి.

నిశితంగా పరిశీలించాకే...



నూతన ఏడాది సందర్భంగా మన ఫోన్లకు వచ్చే రకరకాల గిఫ్ట్ ఓచర్లు, గ్రీటింగ్స్, ట్రావెల్ గ్యాడ్జెట్స్, ఫ్యాషన్లపై ఇచ్చే డిస్కౌంట్లను ఒకటికి నాలుగుసార్లు నమ్మదగినవా? కాదా? అన్నది పరిశీలన చేసుకోవటం అత్యవసరం. వాటి రివ్యూస్ చూస్తూ వెరిఫైడ్, అథెంటిక్ వెబ్‌సైట్లలోకి వెళ్లి ఆఫర్లను తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. అలాగే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో కూడా అప్రమత్తంగా ఉండాలి.

అప్రమత్తంగా ఉండాలి



అపరిచిత వ్యక్తులు పంపించే ఏపీకే ఫైల్స్, లింక్ మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తారు. శుభాకాంక్షలు చెప్పాలనుకుంటే నేరుగా చెప్పడం లేదంటే సందేశాన్ని పంపండి. వీలైతే వ్యక్తిగతంగా కలుసుకోవడం మంచిది. నూతన సంవత్సరాన్ని అందరూ ఆనందంగా జరుపుకోవాలి. సైబర్ వలలో మాత్రం చిక్కకుండా అప్రమత్తంగా ఉండండి. – కళా వెంకటరమణ, తాలూకా సీఐ, మదనపల్లె

డ్వాక్రా రుణం ఇవ్వకుండా వేధింపులు

- మహిళ ఆత్మ హత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

రైల్వేకోడూరు అర్బన్: తోటి గ్రూపు సభ్యులు ఒక మహిళకు డ్వాక్రా రుణం ఇవ్వడానికి నిరాకరించి గ్రూపు నుంచి తొలగించే ప్రయత్నం చేయడంతో అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు వెలుగు కార్యాలయంలో రాఘవరాజపురం హరిజనవాడకు చెందిన దళిత మహిళ సోమవారం విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు..మండలంలోని రాఘవరాజపురం హరిజనవాడకు చెందిన బైరారపుదేవి లక్ష్మినరసింహా గ్రూపులో ఎన్నో సంవత్సరాలుగా ఉంటూ లోన్లు తీసుకొంటూ తిరిగి చెల్లిస్తూ ఉండేది. అదేవిధంగా రెండు నెలల క్రితం పాత లోనుకు 35 వేలు కట్టాల్సి ఉండగా అప్పు చేసి మరీ రుణం తీర్చింది. అయితే ఇప్పుడు 10 మందికి 20 లక్షలు రుణం వస్తుండడంతో స్థానిక రాజకీయ కారణాలతో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరురాలైన ఆమెకు రుణం ఇవ్వకూడదని నిర్ణయించుకొని వేధించసాగారు...కూలి చేసుకొని బాకీ కట్టుకుంటున్నాని ఆమె చెబుతున్నారు. గ్రుపులో కొందరు తనను గ్రూపు నుంచి తీసి వేయాలని చూస్తున్నట్లు వెలుగు ఏపీఎంకు కూడా తెలియజేశానని, అయినా కేవలం తనపై కక్షతో డబ్బులు రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈవిషయమై వెలుగు కార్యాలయంలో ఏపీఎం వసుధర గ్రూపు సభ్యులతో మాట్లాడినా వారు ఆమె మాటలు కూడా ఒప్పుకోకుండా ఉండడంతో అక్కడికక్కడే బైరారపుదేవి విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఏపీఎం బాధితురాలిని ఆస్పత్రికి తరలించి పోలీసులకు విషయం తెలియజేశారు.

వైకుంఠ ఏకాదశికి వసతులు కల్పిస్తాం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశికి విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయం వద్ద ఉన్న అధికారిక భవనంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని సాలాబాద్ క్రాస్ రోడ్డు నుంచి ఆలయం వరకు టీటీడీ అటవీశాఖ వారు నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం బ్రహ్మోత్సవాల సమయంలో కల్యాణం రోజు కల్యాణ వేదిక వద్దకు వచ్చే భక్తులు క్యూలైన్ల వద్ద ఇబ్బంది పడకుండా అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఒంటిమిట రామయ్య భూములను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని టీటీడీ సివిల్ డిపార్టుమెంట్ అధికారులకు సూచించారు. అలాగే కల్యాణ వేదిక వద్ద పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. టీటీడీ డీఎఫ్ఓ శ్రీనివాసులు, ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, సివిల్ ఈఈ సుమతి, డీఈ నాగరాజు, ఏఈ అమరనాథ్‌రెడ్డి, జనరల్ డిప్యూటీ ఈఓ శివ ప్రసాద్, ఒంటిమిట్ట డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

లింగ నిర్ధారణకు పాల్పడితే స్కానింగ్ సెంటర్లపై కేసులు

- జిల్లా కలెక్టర్ శ్రీధర్



రాయచోటి: జిల్లాలో మోసపూరితంగా లింగ నిర్ధారణకు పాల్పడితే స్కానింగ్ సెంటర్లపై ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి బహుళ సభ్యుల సముచిత అధికార కమిటీ సమావేశం, డీఎల్ఏసీ, ఏఆర్‌టీ కమిటీ జాయింట్ కమిటీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల వివరాలు, వాటి నిర్వహణ, రికార్డ్స్ అప్‌లోడింగ్ డిటెయిల్స్ వాటి వివరాలను కలెక్టర్‌కు తెలియపరిచారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కలెక్టర్ సమక్షంలో ఆరు కొత్త స్కాన్ సెంటర్లు, ఒక రెన్యువల్, ఆరు స్కాన్ సెంటర్లలో సవరణలకు అనుమతులు ఇచ్చారు. ఫారం-ఎఫ్ తరచూ అప్‌లోడ్ చేయని సెంటర్ల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

- దివ్యాంగుల అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదని జిల్లా కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వర్చువల్‌గా, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేతులు మీదుగా ఉచిత స్కూటర్లను పంపిణీ చేశారు. లక్కిరెడ్డిపల్లి మండల పరిధిలోని కాపుపల్లికి చెందిన కట్ల ఆదినారాయణ (40), వేముల వాండ్లపల్లికి చెందిన కాల్వ చంద్రశేఖర్ (90)లకు రెండు లక్షల రూపాయలతో కొన్న 02 రెట్రో ఫిటెడ్ మోటర్ స్కూటర్లు పంపిణీ చేయడం జరిగింది.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఇక్కడ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగుతుందని అన్నారు.

అదుపులోనే శాంతిభద్రతలు

- 2023లో 4289 కేసులు నమోదు కాగా.. 2024లో 3616 కేసుల నమోదు
- గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో 15.69 శాతం తగ్గిన క్రైమ్
- పటిష్ట పోలీస్ బందోబస్తుతో శాంతిభద్రతలను స్థిరపరుస్తాం
- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడు జిల్లాలో క్రైం రేటు 15.69 శాతం తగ్గిందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చెప్పారు. రాయచోటిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం 2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నేరాల సమీక్షపై ఎస్పీ మీడియాకు వివరించారు. జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని పటిష్టపరచడంతో పాటు ప్రజల సహకారంతో శాంతిభద్రతలను స్థిరపరచడంలో సఫలీకృతులం అయ్యామన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్‌నేరాలు, పాక్సో చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి, కమ్యూనిటీ పోలీసింగ్ సోషల్ మీడియా, కళాజాత బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, జిల్లా ప్రజలు, విద్యార్థులు, పౌరులను చైతన్యపరుస్తున్నామని ఆయన వివరించారు. మరింత ఉత్సాహంతో 2025లో మెరుగైన పోలీసింగ్‌తో ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తామన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే 2024లో అన్ని రకాలైన నేరాల నియంత్రణలో గణనీయమైన మార్పు కనిపించిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలను పక్కా ప్రణాళికతో ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరనంలో నిర్వహించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయం అన్నారు.



వార్షిక నివేదిక మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మద్యం స్వాధీనం

అక్రమ మద్యం రవాణా, నాటుసారా తయారీ, విక్రయదారులపై 1144 కేసులను నమోదు చేశామన్నారు. 1168 మందిని కేసుల్లో భాగంగా అరెస్టు చేసి 5055 లీటర్ల నాటుసారా, 5834 లీటర్ల మద్యం, 13475 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం, 53 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపిన 1470 మందిని గుర్తించి, వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.38.83 లక్షలు జరిమానా విధించామన్నారు. గంజాయి విక్రయాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి 126 మందిపై కేసులు నమోదు చేసి 258 కిలోల గంజాయి, 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

- 2024 సంవత్సరం కాలంలో జరిగిన ప్రాపర్టీ కేసుల్లో రూ.5.19 కోట్ల మేర నష్టం చేకూరగా రూ.2.12 కోట్ల మొత్తాన్ని రికవరీ చేయడం జరిగిందన్నారు.
- జిల్లాలో క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా, కోడిపందేలపై ముమ్మర దాడులు చేశామన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి దాడులు నిర్వహించి తగు చర్యలు తీసుకున్నామన్నారు.
- ఎర్రచందనం అక్రమరవాణా నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్పీ చెప్పారు. 2024 సంవత్సరంలో 7 కేసులు నమోదు చేసి 54 మంది ముద్దాయిలు, 25 మంది కూలీలను అరెస్టు చేశామన్నారు.

కేసుల మానిటరింగ్

కేసుల త్వరితగతిన విచారణకు కోర్ట్ మానిటరింగ్ సెల్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కేసుల విచారణ త్వరితగతిన జరిగి సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నేరస్తులకు శిక్షపడేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి 4 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా పోలీస్ అధికారులు సమిష్టిగా కృషి చేశారన్నారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణ కోసం మూడు డ్రోన్లను అందుబాటులో ఉంచామన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇబ్బందులు పడ్డ వారిని కూడా తిరిగి దేశానికి రప్పించి వారి కుటుంబాలతో సంతోషంగా జీవనం సాగించేలా చేసినట్లు ఎస్పీ వివరించారు.

నేరాలు తగ్గుదల

విజిబుల్ పోలీసింగ్, అసాంఘిక శక్తులపైన నిఘా, అవగాహన కార్యక్రమాలను చేపట్టడం, పీడీ యాక్ట్ ప్రయోగం, నాటుసారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపడం, కనివ్షన్ బేస్డ్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించడం, గంజాయిపైన కట్టడి వల్ల జిల్లాలో నేరాలు 15.69 శాతం తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ తెలియజేశారు. 2023లో 4288 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 3616 కేసులు నమోదైనట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో మాత్రం గత ఏడాది 73 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో నమోదు కావడం విశేషం.

వారి నుంచి 2451 కిలోల బరువున్న 83 దుంగలను, 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

- జిల్లాలో 643 రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాద మరణాల్లో 4.2 శాతం, తీవ్ర రోడ్డు ప్రమాదాల్లో 10.96 శాతం తగ్గుదల ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎంవీ చట్టం ప్రకారం 43,606 ఈ చలానాల ద్వారా రూ.1,13,05,045 జరిమానా విధించడం జరిగిందన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 1470 కేసులు నమోదు చేశారు. సైబర్ నేరాల ద్వారా పోగొట్టుకున్న మొత్తంలో రూ.2.47 కోట్ల మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేశామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీలు కృష్ణమోహన్, సుధాకర్, కొండయ్యనాయుడు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాజారమేష్ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై కొత్త ఏడాది ఆంక్షలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతార ణంలో జరుపుకునేలా మంగళ, బుధవారాల్లో ఆంక్షలను అమలు చేస్తున్నామని సీఐ జీవన్ గంగనాథ బాబు సోమవారం తెలిపారు. వేలమంది తరలిరానున్న నేపథ్యంలో సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వశాఖల సిబ్బంది సహకరించాలని కోరారు. 31వ తేదీన అధికసంఖ్యలో సందర్శకులు వస్తున్నందున చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించాక పైకి అనుమతి ఇస్తారని తెలిపారు. ఆరోజు మద్యం వెంట తీసుకెళ్లకూడదన్నారు. అతిథిగృహాల్లో మద్యాన్ని అనుమతిస్తే గొడవలు జరిగే పరిస్థితులు ఉత్పన్నం కావొచ్చని, అందువల్ల వేడుకల రోజున మద్యం తాగడంపై ఆంక్షలు విధించాలని సూచించారు. కొండపై అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి, జనవరి ఒకటిన ఎవరైనా కొండపై బహిరంగంగా మద్యం తాగినా, మద్యం తాగి బైక్‌రైడ్ చేస్తూ సందర్శకులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్లపై చలిమంటలు వేయకూడదన్నారు. అతిథిగృహాల్లో బస చేసిన సందర్శకులు డీజే శబ్దాలతో ఇబ్బంది కలిగించరాదన్నారు. వేలసంఖ్యలో సందర్శకులు వస్తున్నందున ప్రమాదాల నివారణకు బైక్, ఆటోలను కొండపైకి వెళ్లడానికి రెండురోజులు నిషేధించామని చెప్పారు. వీటిని చెక్‌పోస్టు వద్దే నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. కొండపై సందర్శకులు ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా పార్కింగ్ ప్రాంతంలోనే నిలిపి ఉంచాలని సూచించారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా



బహుదా కాజ్ వే పై బోల్తా పడిన ట్రాక్టర్

నిమ్మనపల్లె : ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి ప్రాణాపాయం తప్పిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఆదివారం రాత్రి మండలంలోని పారేసువారిపల్లెకు చెందిన ట్రాక్టర్ యజమాని మనోహర్ నిమ్మనపల్లి వైపు నుంచి ముష్టూరులోని వలసపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా బహుదా ఏటి కాజ్‌వేపై ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న మనోహర్‌కు అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు కాకుడా క్షేమంగా బయటపడ్డాడు. నాలుగేళ్ల క్రితం తుఫాను కారణంగా వరదలతో బహుదా నదిపై ఉన్న కాజ్ వే పూర్తిగా దెబ్బతినింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం స్థానికులు గుంతలకు రాళ్లు, మట్టి తోలారు.

బస్సు, లారీ ఢీ
– తప్పిన పెను ప్రమాదం



లారీ, బస్సు ఢీ కొన్న దృశ్యం

నందలూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బస్సు, లారీ ఢీ కొన్న సంఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి రాజంపేట నుంచి కడప వైపు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా కడప నుంచి రాజంపేట వైపు వెళ్తున్న లారీలోని వస్తువులు బయటకు వచ్చి చీకట్లో కనిపించలేదు. దీంతో బస్సు ఢీ కొంది. ఈ సంఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత మృతిపై తహసీల్దార్ విచారణ

మదనపల్లె : వివాహిత అనుమానాస్పద మృతిపై మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీ సోమవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి, శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మదనపల్లె పట్టణం రామిరెడ్డి లేఔట్‌లో నివసిస్తున్న ఆనంద్ కుమార్తె లావణ్య(24)కు గౌతమి నగర్‌లో నివసిస్తున్న నాగరాజు కుమారుడు మధుకర్‌తో 2019 సంవత్సరంలో వివాహం జరిపించారు. వీరికి ఒక కుమార్తె ఉంది. కాగా మధుకర్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసేవాడు. భార్య లావణ్యను సక్రమంగా చూసుకోకపోవడం, తరచూ గొడవలు పడుతుండడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. అనంతరం మదనపల్లె గౌతమి నగర్‌లో కాపురం ఉంచారు. ఇటీవలే కుటుంబమంతా అరుణాచలం వెళ్లి వచ్చారు. అయితే ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో లావణ్య మూర్ఛ వచ్చి పడిపోయిందని ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన వెళ్లగా సోఫాలో అపస్మారక స్థితిలో లావణ్య పడి ఉండటాన్ని చూసి, వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తమ కుమార్తె మృతికి భర్త మధుకర్, అతని కుటుంబ సభ్యులే కారణమని పేర్కొంటూ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం లావణ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

క్రేజీ కేక్స్

- న్యూఇయర్ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ కేక్‌లదే
- తయారీకి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న తయారీదారులు



న్యూఇయర్‌కు రెడీ అయిన కేక్‌లు



కేక్‌లను తయారు చేస్తున్న కార్మికులు

రాజంపేట టౌన్ : ఒకప్పుడు న్యూఇయర్ అంటే కొత్త దుస్తులు, గ్రీటింగ్ కార్డుల కొనుగోలుకు ప్రజలు ప్రాధాన్యత ఇచ్చే వారు. అయితే ఇప్పుడు ప్రజల అభిరుచి మారింది. న్యూఇయర్‌లో కేక్ ఒక భాగమైపోయింది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 12 గంటలు కాగానే చాలా మంది కేక్ కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. ఇక యువత కేక్‌లు కట్ చేయడమే కాక స్నేహితులు ఒకరి ముఖాలకు మరొకరు పూసుకొని న్యూఇయర్‌కు జోష్‌గా వెల్‌కమ్ చెప్పడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. అందువల్ల వ్యాపారులు పెద్ద ఎత్తున కేక్‌లను అందుబాటులో ఉంచాల్సి వస్తుంది. ఈ కారణంగా న్యూఇయర్‌కు మూడు రోజుల ముందు నుంచే కేక్‌ల తయారీ ప్రారంభమైంది.

సృజనాత్మకతకు పదును

కేక్‌ల సంస్కృతి మొదలైన కొత్తల్లో కేక్‌లను కొన్ని ఆకృతుల్లోనే తయారు చేసేవారు. అయితే ఇప్పుడు యువత ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటుంది. అందువల్ల కేక్ తయారీ కళాకారులు మూస ధోరణికి స్వస్తి చెప్పి తమ సృజనాత్మకతకు పదును పెడుతున్నారు. ఫలితంగా ఇప్పుడు అబ్బురపరిచే ఆకృతుల్లో కేక్‌లను వ్యాపారులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రతి ఏడాది వేల సంఖ్యలో కేక్‌లను అందుబాటులో ఉంచుతున్నా, డిసెంబర్ 31వ తేదీ రాత్రి అనేక మందికి కేక్‌లు దొరకని పరిస్థితి నెలకొంటుంది. అంటే ప్రతి ఒక్కరు చిన్నపాటి కేక్‌ను అయినా కట్ చేసి న్యూఇయర్‌కు వెల్‌కం చెప్పేందుకు ఇష్టపడుతున్నట్లు అర్థమవుతుంది. న్యూఇయర్ సందర్భంగా కేక్స్‌కు ఉన్న డిమాండ్ కారణంగా ఈ ఏడాది గత ఏడాది కంటే ఎక్కువ స్థాయిలో కేక్‌లు తయారు చేయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే చాలా మంది కేక్‌ల కోసం అడ్వాన్సులు కూడా ఇచ్చినట్లు వ్యాపారులు తెలుపుతున్నారు. కొంతమంది ఆకర్షించే ఆకృతుల్లో ప్రత్యేకంగా కేక్‌లు తయారు చేయించుకుంటున్నారు.

రుచిలోనూ మేటి..

కేక్‌లు ఇప్పుడు రుచిలోనూ మేటిగా మారాయి. వివిధ ఫ్లేవర్లలో అందుబాటులో ఉన్నాయి. వెనీలా, బటర్ స్కాచ్, పైనాపిల్, కస్టర్డ్ ఆపిల్, చాక్లెట్ కేక్‌లు వినియోగదారులను నోరూరిస్తున్నాయి. ఇక కూల్‌కేక్‌లు కూడా అందుబాటులోకి వచ్చి ఆహా అనిపిస్తున్నాయి. ఫ్లేవర్‌లు, కేజీలను బట్టి ధరలు ఉన్నాయి.

కేక్‌ల తయారీకి ఇతర రాష్ట్రాల నుంచి....

కేక్‌ల తయారీకి అనేక మంది వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి కేక్‌ల తయారీ కార్మికులను రప్పించారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి కేక్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు కార్మికులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.

చాలా హ్యాపీగా ఉంటుంది



న్యూఇయర్ ఆగమన వేళ కేక్ కట్ చేయడంలో చక్కటి అనుభూతి ఉంటుంది. కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టిన వెంటనే అమ్మానాన్నల నుంచి ఆశీర్వాదం తీసుకొని వారితో కలిసి కేక్ కట్ చేయడం వల్ల మాటల్లో చెప్పలేని సంతోషం కలుగుతుంది.
– జాహ్నవి, ఇంజినీరింగ్ విద్యార్థిని, రాజంపేట

చేతినిండా పని..



మాది కలకత్తా. న్యూఇయర్‌కు కేక్‌లు కట్ చేసే ట్రెండ్ ఇక్కడ ఎక్కువ. అందువల్ల నేను, మా ఫ్రెండ్స్ ప్రతి ఏడాది న్యూఇయర్‌కు కేక్‌లు తయారు చేసేందుకు రాజంపేటకు వస్తాము. ఇక్కడ మాకు చేతినిండా పని ఉంది. న్యూఇయర్ వల్ల మేము డబ్బులు సంపాదించుకుంటాము.
– సోమనాథ్, కేక్‌ల తయారీ కార్మికుడు, కలకత్తా

కేక్‌లు కొరత ఉండకూడదని...



న్యూ ఇయర్ సందర్భంగా ప్రతి ఒక్కరు కేక్ కట్ చేసి కొత్త సంవత్సర ఘడియలను సంతోషంగా ఆస్వాదించాలనుకుంటున్నారు. అందువల్ల ప్రతి ఏడాది కూడా కేక్‌ల కొరత ఉంటుంది. ఈ కారణంగా ఈ ఏడాది కేక్‌ల కొరత లేకుండా ఉండేందుకు నావంతు కృషి చేస్తున్నా. వీలైనన్ని కేక్‌లను తయారు చేయిస్తున్నా.
– జిలానీ, వ్యాపారి, రాజంపేట

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లి మండలం రెడ్డి కోట పంచాయతీ ఇర్లవారిపల్లికి చెందిన శంకర కుమారుడు శ్రీనాథ్(23), కుటుంబ సమస్యల కారణంగా సోమవారం ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. మదనపల్లి పట్టణం నీరుగట్టువారిపల్లె మాయాబజార్ వీధికి చెందిన చందు కుమార్ (23), కుటుంబ సమస్యల కారణంగా విష ద్రావణం తాగాడు. పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన సయ్యద్ సాదిక్ భార్య ముస్కాన్ (37), బంధువులకు కొంత నగదు అప్పుగా ఇచ్చింది. వారు తిరిగి చెల్లించకపోవడంతో మనస్థాపం చెంది పురుగు మందు తాగింది. బాధితులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



రహదారికి అడ్డంగా గోతులు తీసిన స్థానిక రైతులు

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని స్థానిక రైతులు పెన్నానదిలోకి ట్రాక్టర్‌లు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా గోతులు తీయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ టక్కోలు పెన్నానది నుంచి ప్రతి రోజు ఎక్కువ సంఖ్యలో ట్రాక్టర్‌ల ద్వారా కడప నగరానికి ఇసుక తరలిస్తుండగా తమ పంట పొలాలకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారిందన్నారు. దీంతో సోమవారం పెన్నానది లోకి వెళ్లే రహదారికి అడ్డంగా జేసీబీ యంత్రంతో గోతులు తీశామని రైతులు తెలిపారు.

జనారణ్యంలోకి జింక



రామసముద్రం దిగువపేటలో పరుగులు తీస్తున్న జింక

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలోని దిగువపేటలో సోమవారం ఓ జింక దారితప్పి జనారణ్యంలోకి వచ్చింది. ఇది గమనించిన వీధి కుక్కలు జింకను వెంబడించి దాడి చేసేందుకు ప్రయత్నించాయి. జింక వాటికి దొరక్కుండా తప్పించుకుని తిరుగుతుండగా స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఇటీవల జింకలు, దుప్పిలు, నెమళ్లు గ్రామాల పరిసర ప్రాంతాల్లోకి దారి తప్పి వస్తున్నాయని మండల ప్రజలు చెబుతున్నారు. అవి కుక్కలు, వేటగాళ్ల ఉచ్చులో పడకుండా అటవీశాఖ అధికారులు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల వాగ్దానాలపై చంద్రబాబు యూటర్న్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలపై యూటర్న్ తీసుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో అడ్డమైన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నిధుల కొరత సాకు చూపుతూ గత ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నా రు. మూడు పర్యాయాలు సీఎంగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్ర ఆర్థికపరిస్థితులపై అవగాహన లేకనే హామీలు ఇచ్చారా అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు ఏమాత్రం పెంచబోమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే మానుకోవాలన్నారు. వలంటీర్లకు వేతనం రూ.10 వేలు చెల్లించాలన్నారు. లోకేష్ రాసుకున్న రెడ్‌బుక్ పేజీలు చిరిగిపోతున్నాయని, భూకబ్జాకోరులు, అవినీతిపరులను కూటమి ప్రభుత్వంలో చేర్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఒకేదేశం,- ఒకే ఎన్నిక- ఒకే నాయకుడు అంటూ జీవితకాలం తమ ప్రభుత్వమే అధికారంలో ఉండాలనే దురుద్దేశంతో బీజేపీ నేతలు జమిలి ఎన్నికలు అంటున్నారని మండిపడ్డారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేడ్కర్‌పై పార్లమెంటులో కేంద్రహోం శాఖమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కు తీసుకుని భారత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లాకార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, సు మిత్రమ్మ, విశ్వనాథ నాయక్, ఎస్.శ్రీనివాసులు, సుధీ ర్ కుమార్, చిన్నయ్య, మురళి, జిల్లా కౌన్సిల్ సభ్యు లు వంగిమళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతిపై

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కోర్టు ఎదుట రాయచోటి న్యాయవాదుల నిరసన ప్రదర్శన



రాయచోటిలో కోర్టుముందు నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి, ఆయన మృతికి కారణమైన అనంతపురం త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను వెంటనే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలని రాయచోటి న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి సీఐ శాంతిలాల్ చర్యకు నిరసనగా కోర్టు గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి డి.నాగముని మాట్లాడుతూ ఒక సివిల్ కేసు విషయంలో న్యాయవాది శేషాద్రిని శనివారం రోజున అనంతపురం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ స్టేషన్‌కు పిలిపించి దండించినందుకు తీవ్ర మనస్థాపానికి గురైన శేషాద్రి సీఐ ఛాంబర్‌లోనే గుండెపోటుకు గురై చనిపోయాడన్నారు. శేషాద్రి వెంట వెళ్లిన జూనియర్ న్యాయవాదులను పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించకపోవడం శోచనీయమన్నారు. సివిల్ కేసుల్లో జోక్యం చేసుకోవద్దంటూ సుప్రీంకోర్టు పదేపదే చెబుతున్నా సీఐ శాంతిలాల్ ఖాతరుచేయకపోవడం దారుణమన్నారు. న్యాయవాది మృతికి బాధ్యత వహిస్తూ ప్రభుత్వం వెంటనే వారి కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనందకుమార్, న్యాయవాదులు నాగేశ్వర, ఎం.రవి శంకర్, ఎం.వి.రమణ, టి.వి.రమణ, నిరంజన్, సుబ్బరాయుడు, వరలక్ష్మి ఆనంద్, ఇలియాస్ బాషా, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కురబలకోట : దికురబలకోట రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో శివ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో మహిళ తీవ్రంగా గాయపడింది.ముదివేడు పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె డిపోకు చెందిన గాలివీడు ఆర్టీసీ బస్సు కురబలకోట రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద రాత్రి రిపేరుకు గురైంది. కండక్టర్ దిగి ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించే ప్రయత్నాల్లో ఉన్నారు. అదే సమయంలో ఎదురుగా బైక్‌లో వచ్చిన ఇద్దరు బస్సును ఢీకొట్టారు. ఈ సంఘటనలో మదనపల్లె పట్టణం చంద్రాకాలనీ దగ్గరున్న కనకదాసు నగర్‌కు చెందిన శివ మృతి చెందాడు. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. ఈమె ఎవరన్నది గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రామయ్యను దర్శించుకున్న ఎస్‌బీఐ ఆర్‌జీఎం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామిని సోమవారం అమరావతి సర్కిల్ తిరుపతి రీజినల్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి బాలాలయంలోని సీతారామ లక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఒంటిమిట్ట ఎస్‌బీఐ మేనేజర్ జగదీష్ ఆధ్వర్యంలో సిబ్బంది సత్కరించారు. ఆయన వెంట రీజనల్ మేనేజర్ మురళీ నాయక్, క్యాషియర్ ఎస్.చైతన్య, సీనియర్ అసోసియేట్లు బాలాజీ నాయక్, నందిని ఉన్నారు.

మారని కూటమి తీరు.. మళ్లీ అదే తంతు!

- తంబళ్లపల్లె ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా
- మండల మీట్ వాయిదా వేసిన ఎంపీడీఓ



తంబళ్లపల్లె ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కూటమి శ్రేణుల ధర్నా

బి.కొత్తకోట / తంబళ్లపల్లె : అధికార కూటమి శ్రేణుల తీరు ఏ మాత్రం మారలేదు.మళ్లీ మళ్లీ మండలమీట్‌లను అడ్డుకునే తంతును కొనసాగిస్తున్నాయి. సోమవారం తంబళ్లపల్లె మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండలమీట్‌ను అడ్డుకుంటామంటూ బైఠాయించారు. ఎంపీటీసీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసలు జరగని మండల మీట్‌ను అడ్డుకునేందుకు వచ్చిన ఈ శ్రేణులు వాయిదాతో వెనుదిరిగారు. ఈ వివరాల్లోకి వెళ్తే.. సోమవారం తంబళ్లపల్లె మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి ప్రకటించారు. అయితే ఈ సమావేశానికి సంబంధించి ఎంపీడీఓ నుంచి ఎలాంటి సర్క్యులర్లు అందలేదని, తాము హాజరుకావడం లేదంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీపీ సహా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. అయితే ఈ మండలమీట్‌ను అడ్డుకుంటామని కూటమి నాయకులు, కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సమావేశానికి ఎంపీపీ, ఎంపీటీసీలు వస్తే అడ్డుకుని వెనక్కు పంపాలని వేచి చూశారు. అయితే ఒక్క ఎంపీటీసీకాని, సర్పంచు కాని ఇటువైపు రాలేదు. వారి రాకకోసం ఎదురు చూసిన శ్రేణులకు నిరాశే మిగిలింది. దీంతో కూటమి శ్రేణులు కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వానికి మద్దతుగా, వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిర్ణీత సమయానికి అరగంట తర్వాత వరకు మండలమీట్‌కు సభ్యులు ఎవ్వరూ హాజరు కాలేదని, దీంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు. తర్వాత కొంత సేపటికి కార్యాలయం నుంచి కూటమి శ్రేణులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా మండలమీట్ జరిగితే పటిష్ట భద్రత కల్పించేందుకు సీఐ లక్ష్మన్న, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహించారు.

మూగ జీవాలకు వింత వ్యాధి

- నిర్లక్ష్యంలో అధికారులు
- లబోదిబోమంటున్న పాడి రైతులు




పురుగులు పడి మృతి చెందిన మేక



ఆవు కంటిలో నుంచి రక్తం వస్తున్న దృశ్యం


రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురంలో మేకలు, గొర్రెలకు వింత వ్యాధి సోకి జీవాలు మృతి చెందుతున్నట్లు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజుల నుంచి మేకలకు, గొర్రెలకు మూతికి పుండ్లు రావడం, కాళ్లు వాయడం , మెడలు సొట్ట పోవడం, వంటివి జరుగుతున్నాయని తెలిపారు. సంబంధిత పశు సంవర్ధక శాఖ అధికారులు గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని యజమానులు వాపోతున్నారు. సుమారు గ్రామంలో 800కు పైగా గొర్రెలు, మేకలు, ఆవులు ఉన్నాయి. అదేవిధంగా పశువులకు కూడా కళ్లలో రక్తం కారడం వంటివి జరుగుతున్నాయని రైతు లు ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగు చేయాలన్నా దిగుబడి సరిగ్గా రాకపోవడంతో అప్పు చేసి మూగజీవాలను కొనుగోలు చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో తా ము కుటుంబాన్ని పోషించుకుంటున్నామని వారు తెలిపారు. ప్రస్తుతం వింత వ్యాధి సోకి మృతి చెందుతుండటంతో వారు లబోదిబో మంటున్నారు. ఈ విషయంపై మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా సంబంధిత గ్రామాలలో పర్యటించి మూగజీవాలకు వైద్యం అందిస్తామన్నారు. యజమానులు ధైర్యంగా ఉండాలని సూచించారు.

వింత వ్యాధితో చనిపోతున్నాయి..



నాకు 80 గొర్రెలు ఉన్నాయి. గొర్రెలు, మేకలకు వింత వ్యాధి సోకి మృత్యువాతపడుతున్నాయి. ఇప్పటికే వారం రోజులలో పది జీవాలు మృతి చెందాయి. ఉండే గొర్రెలకు కూడా వ్యాధులు సోకి నడవలేని పరిస్థితిలో ఉన్నాయి. సంబంధిత అధికారులు పశువులకు వైద్యం అందించాలి.
– ఇనకాల రామ్మోహన్, కొత్తరోడ్డు నారాయణపురం, కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ, రామాపురం మండలం.

కనిపించని పశువైద్యాధికారులు..



మా గ్రామంలో పశువులకు, మేకలకు, గొర్రెలకు వింత వ్యాధి సోకింది. మూతికి పుండ్లు, కాళ్లకు వాపులు నడవలేని పరిస్థితుల్లో గత పది రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నాయి. జీవాలు మృతి చెందుతున్నా కనీసం పశు వైద్యాధికారులు గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో పర్యటించాలి.
– శ్రీనివాసులు, కొత్తరోడ్డు నారాయణపురం, కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ, రామాపురం మండలం.

నూతన సంవత్సర వేడుకల్లో ..

తస్మాత్ జాగ్రత్త!

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



కడప అర్బన్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఈనెల 31వ తేదీ రాత్రి, నూతన సంవత్సరం వేడుకలకు సంబంధించి పోలీసు వారి సూచనలను ప్రజలు, వాహనదారులు తప్పక పాటించాలని ఉమ్మడి జిల్లాల ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఈ రెండు జిల్లాల పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి జనవరి 1వ తేదీ ఉదయం 5 గంటల వరకు ప్రతి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అన్ని ప్రధాన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు చేపడతారు.
- స్పెషల్ టీమ్స్, మొబైల్ టీమ్స్‌గా ఏర్పడి ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, స్పీడ్ లేజర్ గన్ ద్వారా వాహన తనిఖీలు చేస్తారు.
- కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ నుంచి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, గువ్వలచెరువు ఘాట్ రోడ్డు, రిమ్స్ రింగ్ రోడ్డు మిగతా బైపాస్ రోడ్లను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 3 గంటల వరకు మూసివేస్తారు.
- బైక్‌లను అకారణంగా రోడ్లపైకి అనుమతించరు. మైనర్లు వాహనాలను నడిపితే వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- ద్విచక్రవాహనాల సైలెన్సర్స్ తీసివేసిన వాహనాల యజమానులపై, నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- వేడుకల పేరుతో మహిళల పట్ల, ఇతర వాహనదారుల పట్ల అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తించరాదు.
- ఎవరైనా నూతన సంవత్సర ఈవెంట్స్ నిర్వహించాలనుకుంటే ముందుగా ఎస్‌డీపీఓ అనుమతి తీసుకోవాలి.
- రోడ్లపైన ట్రాఫిక్ జామ్ చేసి, కేకులు కట్ చేయరాదు. రోడ్లపైన ఉన్న బారికేడ్స్‌కు, డివైడర్స్‌కు, రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలకు నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- రోడ్లపైనగానీ, జంక్షన్ల వద్ద ఎలాంటి టపాసులు పేల్చరాదు.
- నూతన సంవత్సరం సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, ఏం చేస్తున్నారు అనే విషయాలపై తప్పనిసరిగా నిఘా ఉంచాలి.